# కూలిపోయిన సామ్రాజ్యం

మొదట్నుంచి కూడా నగలు, నాణ్యాలూ, మంచిచీరలు వీటికి నేను ఎప్పుడూ ప్రాముఖ్యం ఇవ్వలేదు. వంటింటి అందాన్ని రెట్టింపు చేసే సామాన్లనే వీటినే ఎక్కువ ఇష్టపడేదాన్ని. నాకు వంటిల్లు ఓ సామ్రాజ్యం. దాన్ని ఎలాగైన, ఏ కోణంలోంచి చూసినా అబ్బా! అనిపించేలా చెయ్యాలని నా తాపత్రయం.

నేను పుట్టింది పెరిగింది అమలాపురం దగ్గర ఓ పల్లెటూరు. అక్కడ మా ఇంట్లో వంటిల్లు. నట్టిల్లు అని రెండు పక్కపక్కగా ఉండేవి. ఆ రెండు కూడా మట్టినేలలు. వంటింట్లో పొయ్యి మట్టి పొయ్యి.. మట్టిపొయిల్ని రోజూ రాత్రి కడిగి, ముగ్గు చేతిలో పోసుకుని మొట్టికాయలు వేసేదాన్ని. ప్రతి శుక్రవారం నట్టిల్లు వంటిల్లు అలికి, ముగ్గుని గుప్పెట్లో పోసుకుని, వేళ్ల మధ్యలోంచి సన్నగా జారుస్తూ గీతలు గీస్తూ పోయ్యేదాన్ని. ఆ తర్వాత ముగ్గు గొట్టం కొన్నాకా ముగ్గు వెయ్యడం చాలా సులువు. ఈ పనుల్నీ ఎంతో ఇష్టంగా చేసేదాన్ని.

"అమ్మా వంటకి గట్టు కట్టించుకుందాం. హాయిగా నుంచుని నీట్‌గా చేసుకోవచ్చు" ససేమిరా కుదర్దన్నారు. 'గ్యాస్ కొందాం. అందరిళ్లల్లో ఉంది' అంటే 'చాల్లే రోజూ దేవతార్చన అదీ చేసుకునేవాళ్లం. మడీ ఆచారం వాళ్లం. రోజు గ్యాస్‌మీద ఎలా చేస్తాం!" నా ఉత్సాహం మీద నీళ్ళు పోసారు.

ఏదైనా అంటే, "నీకు పెళ్లయ్యాక, నీ వంటిల్లు నీకు నచ్చినట్లుగా నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో. అందుకే ఈ అమలాపురం, పల్లెటూళ్ళు వదిలి నీకు హైదరాబాద్ సంబంధం చూస్తున్నాం.

పెళ్లయ్యాకా హైదరాబాదొచ్చాను. ఆ ఇంట్లో వంటిల్లుంది. ఆ వంటిల్లు మా అత్తగారిదని తెలియడానికి ఎంతోకాలం పట్టలేదు. నా గది ఓ పడగ్గదీ మాత్రమే. ఆవిడకి సాయం చెయ్యడానికి నేనుండాలి. కానీ, ఏం ముట్టుకోవడానికి లేదు. ఓ రోజున ఎంతో ఉత్సాహంగా డబ్బాలు, సీసాలు, గాజుసామాన్లు అన్నీ సర్దాను. ఆవిడ వచ్చాకా నన్ను ఏమీ అనలేదు కానీ, ఇది వరకు లాగానే ఆవిడ పూర్వస్థితికి వంటింటిని తీసుకొచ్చారు. ఆవిడ అనుమతి లేకుండా ఆమెకి ఇష్టం లేకుండా ఒక్క చెమ్చా కూడా కదలకూడదు అని. సరే ఇంక ఏ పనీ లేనప్పుడు ఇంట్లో ఖాళీగా కూర్చోవడం ఎందుకని ఉద్యోగంలో చేరాను. అత్తగారు పోయాకా వంటింటి సామ్రాజ్యం నా హస్తగతం అయింది. కానీ, డబ్బుకు కటకట. టైల్సువేయిద్దాం అని అనుకున్నప్పుడో, కడపరాయి సింకు తీసేసి స్టీలు సింక్ పెట్టించుకుందాం అనుకున్నప్పుడో, అలమారలు దుమ్ము కొట్టుకుంటున్నాయి డెకొలం తలుపులు పెట్టించుకుందాం అని అనుకున్నప్పుడు డబ్బు ఇబ్బంది. ఏదో ఖర్చు, పిల్లలు పెద్దవాళ్లయ్యారు. ఎమ్ సెట్ కోచింగ్‌లు, చదువులు ఇలా ప్రతీసారి ఏదో ఖర్చు నా వంటిల్లు దొంగాట దోబూచులాటలే.

ఓసారి నాన్నగారికి ఒంట్లో బాగాలేదంటే ఊరెళ్ళాను. నేనొచ్చాను కదాని, పెద్దొదిన వాళ్ల నాన్నగారు పెరట్లో జారిపడ్డారుట అని కబురొస్తే నేదునూరు వెళ్ళింది. మేనకోడలు అమెరికా నుంచి వచ్చిందని చిన్న వదిన నందంపూడి వెళ్లింది. నాలుగురోజులు అమ్మా నేను బోల్డు కబుర్లు చెప్పుకుంటూ నాన్నగారి దగ్గర కూర్చుని అష్టాచెమ్మా, పేకాటాడుకుంటూ కులాసాగా గడిపేశాను.

"ఒక్క నాలుగురోజులు లేకపోతే వంటిల్లు తల్లకిందులైపోయింది. కాఫీపొడి దగ్గర, టీ పొడుం దగ్గర పోపు సామాన్ల డబ్బాలున్నాయి. నా చెయ్యికి వీలుగా, నేను అన్నీ కుడిచేతివైపు పెట్టుకుంటే, అన్నీ ఇటుదిటు, అటుదిటూ చేసింది. వేరేవాళ్ళ ఇంటి వంటిల్లు ఇలా చెయ్యడంలో ఏం సంతోషం వస్తుందో.... ఏం ఆనందం వస్తుందో .... అర్థం కాదు." వదినలిద్దరి సణుగుడు నాకు వినపడింది.

ఎంత పిచ్చిదాన్ని నా పెళ్లయ్యాక ఆ ఇల్లు పరాయి ఇల్లు అని తెలియడానికి ఇంతకాలం పట్టిందా! ఏంవిటో వంటిల్లు సర్దేసాను. నా వెర్రితనం.

నాకు, ఆయనకి ప్రమోషన్లు వచ్చినా, జీతాలు పెరిగినా నా మోడర్న్ వంటింటి కోరిక అలాగే వుండుపోయింది. పెద్ద పిల్లాడి చదువైంది. మంచి ఉద్యోగమే వచ్చింది.

ఆయన కూడా బాంక్‌లో చాలా మంది వి ఆర్ ఎస్ తీసుకున్నారంటూ తను కూడా తీసుకున్నారు.

మేమిద్దరం రోజు తెల్లవారు జామున కాఫీ తాగుతున్నప్పుడు పిచ్చాపాటి వేసుకుంటూ చాలా ఇంపార్టెంట్ డెసిషన్స్ తీసేసుకుంటాం.

ఎప్పటిలా కాఫీ ఇచ్చి నేను వంటింటి గురించి అడిగాను.

"వంటింటిని మార్చాలి...."

"ఏదైనా వాస్తు గురించా, అయినా ఆగ్నేయంలోనే ఉందిగా"

"అది కాదు.... ఇల్లు కట్టినప్పట్నించి అడుగుతున్నాను. పెరిగే పిల్లలు, చదువుల మూలంగా వంటింటినీ అలాగే ఉంచేసాం.

ఇప్పుడు డబ్బు ఇబ్బందులేం లేవు. అబ్బాయికి మంచి ఉద్యోగం ఉంది..."

"ఓ.కే. వంటింటిని రెనోవేట్ చేయించాలంటావ్. ఓ.కే. సాంక్షన్డ్"

"ఉండండి..." మంచం మీంచి లేచి, పరుపు కింద దాచిన, ఫెమినా లోంచి, విమెన్స్ ఎరా లోంచి కట్ చేసినవి ఆయనకి చూపించా. ఆయన కూడా చాలా ఇంప్రెస్ అయ్యారు. ఆ తర్వాత అన్నీ చకాచకా జరిగిపోయాయి. కుకింగ్‌రేంజ్, ఎలక్ట్రిక్ చిమ్నీ, లామినేటెడ్ కిచెన్ కౌంటర్, కిటికీ కి వేనీషియన్ బ్లైండ్స్, క్రీపర్, ఒవెన్, మైక్రో ఓవెన్ అన్నీ అందంగా అమర్చడం అయింది. ఎన్నో ఏళ్లుగా వస్తువులు వాడనివి, గిఫ్టులు, సేల్‌లో కొన్న మిస్ట్ గ్లాసులు, క్రిస్టల్ గ్లాసులు, పెడస్టల్ గ్లాసులు, అన్నీ కూడా అందంగా, అద్దాల వెనకాల సర్దాను. పైరాక్స్ కాస్సెరోల్స్, బోన్ చైనావి అన్ని కూడా దొంతులుగా అందంగా సర్దాను. ఉద్యోగం కూడా మానేశాను.

రోజు వంటింట్లో తుడిచేపని, మైక్రోఓవెన్‌లో వంట చేస్తూ ప్రతీ నిమిషం ఎంజాయ్ చేస్తూ గడిపేస్తున్నాను. అసలు ఎన్ని రోజులైందో నాకే తెలీదు. పైగా ఉత్సాహం రోజురోజుకి ఎక్కువై మానసికంగా పదేళ్ళు వెనక్కి నన్ను జార్చింది.

మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. అందరూ భోజనాలు చేసారు. మేము తిన్న వెండికంచాలు. గ్లాసులు, చెంబు కడిగి బట్టపెట్టి తుడుస్తున్నాను.

ఫోన్ మ్రోగింది. కోడలు తన గదిలో పడుకుని ఉంటుంది అని అనుకుంటూనే వెంటనే రిసీవర్ ఎత్తాను. "హలో" అనే లోపలే అవతల నుంచి కోడలు గొంతు "హలో" అంది.

"ఏం చేస్తున్నావు?" అవతలి గొంతు.

"పక్కెక్కాను. ఏదో మాగజైన్ చదువుతున్నాను." కిలాకిలా నవ్వులు

"నీకేంవే అదృష్టవంతురాలివి. అత్తగార్ని వంటింట్లో కట్టేశావ్?"

"కోతికి కొబ్బరికాయ. ఎవరి పిచ్చి వాళ్లకానందం" గలగలా నవ్వులు.

"నీకు చాలా తెలివుంది బాబూ! నాకో ఉపాయం చూపించకూడదు. నీలాంటి భోగం నాకు పట్టేందుకు...."

"అలంకృత వాళ్లు డిస్కౌంట్ ఇస్తున్నారట. మీ వంటింటిని డిజైనర్ వంటిల్లులా చేయించు. మా అత్తగారిలా, మీ అత్తగారు కూడా ఒక్కటే సర్దడం, తుడవడం, దులపడం, వీలైతే డిష్‌వాషర్ కూడా.... పనిమనిషిని మాన్పించవచ్చు...."

ఆగకుండా, పకపకా నవ్వులు.

తల తిరిగిపోతోంది. కళ్లు మూసుకున్నాను.

అంతకు ముందున్న ఉత్సాహం ఆవిరి అయ్యిపైకెళ్ళిపోయింది. నిర్వీర్యంగా, నిస్త్రాణంగా అలాగే జారి కూర్చుండిపోయాను.

నా చిన్నప్పటి ఆశలు, నేను కన్న కలలు, నా సామ్రాజ్యం, ముక్కలు ముక్కలుగా పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ మంటలు రేపేస్తూ చెదురుమదురుగా నా కళ్ల ముందు పడిపోతున్నాయి.

❖ 2.3.2002 ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక ❖

❖❖❖